జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
మంగళవారం, మే 18, 2026 పేజీలు :7







## పాలమూరుకు నీళ్లు కావాలి... రాజకీయాలు కాదు”

- పెండింగ్ సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి జేఏసీ గళం
- డిండి లిఫ్ట్ రద్దు చేసి జీఓ 72 అమలు చేయాలని డిమాండ్




# పంట మార్పిడి జరిగేనా?



- జిల్లాలో గణనీయంగా పెరుగుతున్న వరి, పత్తి సాగు
- పడిపోతున్న కూరగాయలు, పప్పు దినుసుల సేద్యం
- తోటలు సైతం కనుమరుగవుతున్న పరిస్థితి

జిల్లావ్యాప్తంగా పంటల మార్పిడి జరగకపోవడంతో రానున్న రోజుల్లో ఇబ్బందికర పరిస్థితులు ఉంటాయని ప్రభుత్వం భావిస్తోంది. జిల్లాలో పప్పు దినుసులు, ఉద్యాన పంటలు, కూరగాయల సాగు ఏటేటా తగ్గిపోతుండటంతో ఆందోళన వ్యక్తమవుతోంది. రానున్న రోజుల్లో ఆహార పదార్థాలకు తీవ్రకొరత వాటిల్లే ప్రమాదముంది. పంటల మార్పిడిపై జిల్లా రైతాంగానికి వ్యవసాయశాఖ అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నా ఆచరణలో అమలు కావడం లేదు. రైతులు అధిక శాతం వాణిజ్య పంటలవైపు మొగ్గు చూపుతున్న

## చివరి ధాన్యం గింజను ప్రభుత్వం
# కొనుగోలు చేస్తుంది

- రూ.50 వేల తక్షణ సాయం అందించిన మంత్రి
- మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యం పరిశీలన..

రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా - ధాన్యం కొనుగోళ్లపై సీఎం నిరంతరం పర్యవేక్షిస్తున్నారు మంత్రి జూపల్లి -గొర్రెల కాపరిని పరామర్శించిన మంత్రి



## ధాన్యం కొనుగోళ్ల వేగవంతానికి జిల్లా యంత్రాంగం
# ప్రత్యేక చర్యలు

- 45 వేల గన్నీ సంచుల పంపిణీ.. అదనపు లారీలు, ట్రాక్టర్ల ఏర్పాటు

**మహబూబ్‌నగర్, మే 17 ( ప్రజా జ్యోతి బ్యూరో )** జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జిల్లా అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహిస్తూ కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసేందుకు అవసరమైన



## ధాన్యం కొనుగోళ్ల వేగవంతానికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు

చర్యలను చేపడుతున్నారు. అకాల వర్షాల నేపథ్యంలో పి.పి.సి కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యం బస్తాల రవాణా కోసం అదనపు లారీలు, ట్రాక్టర్లను ఏర్పాటు చేసి తరలింపును వేగవంతం చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గన్నీ సంచుల సరఫరా, హమాలీల నియామకం, మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 45 వేల గన్నీ సంచులను సరఫరా చేసినట్లు అధికారులు తెలిపారు.

రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ ఆదివారం జడ్చర్ల కాటన్ మార్కెట్ యార్డును సందర్శించి మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోళ్లను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో తగిన సంఖ్యలో హమాలీలను ఏర్పాటు చేయాలని, గన్నీ సంచులు సమృద్ధిగా నిల్వ ఉంచాలని సూచించారు. కొనుగోలు చేసిన మొక్కజొన్నను వెంటనే సమీప గోదాములకు తరలించేలా లారీలు, ట్రాక్టర్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అకాల వర్షాల వల్ల ధాన్యం దెబ్బతినకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతులకు తాగునీరు, నీడ తదితర మౌలిక వసతులు కల్పించాలని, కొనుగోలు అనంతరం వెంటనే రసీదులు అందజేసి ఒ.పి.ఎం.ఎస్ యాప్‌లో వివరాలు నమోదు చేయాలని అధికారులకు సూచించారు. జిల్లా పౌర సరఫరాల సంస్థ డి.యం రవి నాయక్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి గంప శ్రీనివాస్‌తో కలిసి అడ్డాకుల మండలంలోని బాలీద్‌పల్లి, కన్మనూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యం బస్తాలను వెంటనే ట్రాక్టర్ల ద్వారా తరలించాలని నిర్వాహకులను ఆదేశించారు. కన్మనూర్ కేంద్రానికి ఆర్టీవో శాఖ ద్వారా ప్రత్యేకంగా ఒక లారీని ఏర్పాటు చేసి ధాన్యాన్ని రైస్ మిల్లులకు వేగంగా తరలించేలా చర్యలు చేపట్టారు. అలాగే మండలంలోని అన్ని కొనుగోలు కేంద్రాలకు అదనపు ట్రాక్టర్లను ఏర్పాటు చేసి ధాన్యం రవాణాను వేగవంతం చేయాలని అడ్డాకుల ఎ.పి.యం.ను ఆదేశించారు.

రవాణా వాహనాల కొరతను అధిగమించేందుకు మహబూబ్‌నగర్ నుంచి ఏడు లారీలు, అడ్డాకుల చెక్‌పోస్ట్ నుంచి ఐదు లారీలను సమీకరించి సమీప కొనుగోలు కేంద్రాలకు పంపించారు. గన్నీ సంచుల కొరతను నివారించేందుకు వేముల, నందిపేట్, కొమిరెడ్డిపల్లి, భూత్పూర్, మద్దిగట్ల, కరివేన, జనంపేట్, పొన్నకల్, బాలీద్‌పల్లి కేంద్రాలకు తలా ఐదు వేల గన్నీ సంచులను సరఫరా చేసినట్లు అధికారులు వెల్లడించారు.

### చివరి ధాన్యం గింజను ప్రభుత్వం

# కొనుగోలు చేస్తుంది

నాగర్ కర్నూల్ మే 17 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)

కొల్లాపూర్ మండలం ఎనబెట్ల గ్రామ శివారులో శనివారం పిడుగుపాటుకు 30 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది . ఈ ప్రమాదంలో గొర్రెల కాపరి త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డ గొర్ల కాపరి . విషయం తెలుసుకున్న మంత్రి జూపల్లి కృష్ణారావు వెంటనే స్పందించి, బాధిత గొర్రెల కాపరిని పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకుని ఆయనను ఓదార్చారు. ప్రభుత్వం తరఫున పూర్తి అండగా ఉంటామని హామీ ఇస్తూ, తక్షణ సహాయం కింద రూ.50 వేల నగదును అందజేశారు.

తడిసిన ధాన్యం పరిశీలన..

అనంతరం మంత్రి జూపల్లి కొల్లాపూర్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించారు. ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల మార్కెట్ యార్డులో తడిసిన వరి ధాన్యం, మొక్కజొన్న రాశులను ఆయన నిశితంగా పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ఉన్న రైతులతో నేరుగా మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వర్షాల వల్ల ధాన్యం తడిసినప్పటికీ రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని, జిల్లా అధికారుల పర్యవేక్షణలో తడిసిన ధాన్యాన్ని సైతం గోదాములకు తరలిస్తున్నామని మంత్రి వెల్లడించారు. రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

సీఎం నిరంతరం పర్యవేక్షణ..

రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ కొనుగోళ్ల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్నారని మంత్రి తెలిపారు. ఈ ఏడాది రాష్ట్రంలో మొక్కజొన్న దిగుబడి ఊహించిన దానికంటే భారీగా పెరగడంతో గోదాములు సరిపోవడం లేదని చెప్పారు. ఈ సమస్యను అధిగమించడానికి కాటన్ గోదాములు, ప్రైవేట్ గోదాములతో పాటు అవసరమైన చోట ఫంక్షన్ హాళ్లను సైతం వినియోగించుకుని నిల్వ చేస్తున్నామని వివరించారు. ధాన్యం రవాణాకు లారీల కొరత లేకుండా జిల్లా యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండి చర్యలు తీసుకుంటోందన్నారు.

ఇబ్బందులున్నా అధిక ధరకే కొనుగోలు..

కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించినప్పటికీ క్షేత్రస్థాయిలో కొనుగోలు చేయడం లేదని మంత్రి జూపల్లి విమర్శించారు. దీనివల్ల రైతులు అప్పుల్లో కూరుకుపోయే పరిస్థితి వస్తోందన్నారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో మొక్కజొన్నకు చాలా తక్కువ ధర ఉన్నప్పటికీ, రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వమే అధిక ధర చెల్లించి కొనుగోలు చేస్తోందని స్పష్టం చేశారు. హమాలీల కొరత, ఆర్థిక ఇబ్బందులు, గోదాముల కొరత వంటి సమస్యలు వేధిస్తున్నప్పటికీ.. రైతులు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పునరుద్ఘాటించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

## పాలమూరుకు నీళ్లు కావాలి... రాజకీయాలు కాదు"

మహబూబ్‌నగర్, మే 17 (ప్రజా జ్యోతి బ్యూరో): ఉమ్మడి పాలమూరు జిల్లాలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. "పాలమూరుకు నీళ్లు కావాలి... రాజకీయాలు కాదు" అనే నినాదంతో జేఏసీ నేతలు సాగునీటి సమస్యలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

జేఏసీ చైర్మన్ ఎస్. రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి ప్రభుత్వం నిధుల వరద పారించి వేగంగా పూర్తి చేయాలని కోరారు. 72 జీఓ ప్రకారం పాత డిజైన్‌లోనే పాలమూరు -- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నిర్మాణం జరగాలని స్పష్టం చేశారు. ప్రాజెక్టు పూర్తికాకపోవడం ఎవరి పాపమో ప్రజలు ఆలోచించాలని వ్యాఖ్యానించారు. డిండి ఎత్తిపోతల పథకానికి ఏదుల రిజర్వాయర్ నుంచి 0.5 టీఎంసీల నీటి తరలింపు ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలని జేఏసీ డిమాండ్ చేసింది. పాలమూరు--రంగారెడ్డి లిఫ్ట్ నీటిని మళ్లించడం వల్ల మహబూబ్‌నగర్, రంగారెడ్డి రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆరోపించింది. దీనికి బదులుగా నాగార్జునసాగర్--గొట్టిముక్కల ఎత్తిపోతల పథకాన్ని చేపట్టి గొట్టిముక్కుల, చింతపల్లి, కిష్టరాంపల్లి, శివన్నగూడెం రిజర్వాయర్లకు నీరు అందించాలని కోరింది.

తెలంగాణ ఉద్యమ సమయంలో "నీళ్లు--నిధులు--నియామకాలు" ప్రధాన నినాదాలుగా నిలిచినా, రాష్ట్రం ఏర్పడి పదేళ్లు దాటినా పాలమూరు రైతాంగానికి సాగునీటి న్యాయం జరగలేదని జేఏసీ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణా పరివాహక ప్రాంతంలో ఉన్నప్పటికీ మహబూబ్‌నగర్‌కు సరైన నీటి వాటా దక్కలేదని మండిపడ్డారు. ప్రాజెక్టుల వాస్తవ పరిస్థితిని తెలుసుకునేందుకు పార్టీలకు అతీతంగా ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయి పర్యటనలు చేపట్టాలని జేఏసీ సూచించింది. ప్రాజెక్టులపై బీఆర్ఎస్ పాదయాత్ర చేస్తే అభ్యంతరం లేదని, అయితే డిండికి నీటి తరలింపును అడ్డుకోవాలనే నినాదంతో ఉద్యమం జరగాలని పేర్కొంది.

అసంపూర్తి ప్రాజెక్టులపై కూడా జేఏసీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కల్వకుర్తి లిఫ్ట్‌లో పూర్తి స్థాయిలో నీటి ఎత్తిపోతలు జరగడం లేదని, డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థ ఇంకా పూర్తి కాలేదని తెలిపింది. నెట్టెంపాడు, భీమా--1, భీమా--2, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులు లక్ష్యాలను చేరుకోలేకపోయాయని విమర్శించింది.

లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను దక్షిణ తెలంగాణ సాగునీటి నోడల్ పాయింట్‌గా అభివృద్ధి చేయాలని జేఏసీ ప్రతిపాదించింది. ప్రాణహిత--చేవెళ్ల ద్వారా గోదావరి నీటిని తీసుకురావడంతో పాటు జూరాల వరదనీటిని లిఫ్ట్ చేసి లక్ష్మీదేవిపల్లికి తరలించాలని సూచించింది. రాష్ట్రంలో సాగునీటి పంపిణీలో తీవ్ర అసమానతలు ఉన్నాయని పేర్కొంటూ ప్రత్యేక ఇరిగేషన్ కమిషన్ ఏర్పాటు చేయాలని జేఏసీ డిమాండ్ చేసింది. ప్రాజెక్టుల కారణంగా భూములు కోల్పోతున్న రైతులకు కేవలం పరిహారం కాకుండా సాగుభూమి కూడా ఇవ్వాలని అభిప్రాయపడింది. చివరగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలమూరు సాగునీటి చరిత్రను మార్చే అవకాశం ఉన్న నాయకుడిగా నిలవాలని, ప్రత్యేక కార్యాచరణతో అన్ని పెండింగ్ ప్రాజెక్టులను కాలపరిమితిలో పూర్తి చేయాలని జేఏసీ విజ్ఞప్తి చేసింది.

## పంట మార్పిడి జరిగేనా;?

కారణంగా తీవ్ర కొరత ఏర్పడే అవకాశం కనిపిస్తోంది. ఇటీవల రైతు కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి పంటల మార్పిడి అత్యవసరమని నివేదిక సమర్పించింది. ప్రతీ వానాకాలం సీజన్‌లో వరి, పత్తి పంటలు అత్యధికంగా సాగవుతుండగా యాసంగిలో సైతం వరి అత్యధికంగా సాగవుతోంది. ఏటా వరి, పత్తి విస్తీర్ణం పెరుగుతుండగా, కూరగాయల సాగు తగ్గిపోతోంది. సుస్థిర వ్యవసాయం, రైతులు ఆర్థికంగా బలోపేతం కావడం, సహజవనరుల సంరక్షణ, భవిష్యత్‌లో ఆహార భద్రత కోసం పంటల మార్పిడి తప్పనిసరి అని ప్రభుత్వం భావిస్తోంది.

వాతావరణానికి అనుకూలంగా ప్రణాళికలు...

జిల్లాలో వాతావరణానికి అనుకూలంగా ఉండే పంటల ప్రణాళికలు రూపొందించాలని ప్రభుత్వం వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించింది. పంటల మార్పిడి లక్ష్యాలను గ్రామాలవారీగా నిర్ణయిస్తేనే ప్రయోజనం చేకూరుతుందనేది ప్రభుత్వం యోచించింది. గత ప్రభుత్వ హయాంలో కూరగాయల హబ్‌గా హైదరాబాద్, రంగారెడ్డి, నల్లగొండ సరిహద్దు గ్రామాల్లో పెద్దమొత్తంలో సాగుచేయాలని నిర్ణయించి నా ఆ తరువాత ప్రణాళిక నిలిచిపోయింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కూరగాయల సాగును ప్రోత్సహించాలని నిర్ణయించినా ఇంకా అమలుకు నోచుకోలేదు. కూరగాయల సాగు కేవలం జిల్లా వ్యాప్తంగా 2,000 నుంచి 3,000 ఎకరాల్లో మాత్రమే ఉండటంతో ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలు దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ధరలు మండిపోతున్నాయి. పప్పుధాన్యాలు, నూనె గింజలు, చిరు ధాన్యాల పంటలుకూడా గణనీయంగా పడిపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి తప్పడంలేదు. దీన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ప్రణాళికను రూపొందించేందుకు 'రైతువారం' పేరుతో కార్యక్రమాన్ని రూపొందించింది. వరి, పత్తి దిగుబడులు పెరుగుతుండటంతో భవిష్యత్‌లో కొనుగోలు విషయంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉండటంతో ప్రభుత్వం పంటల మార్పిడిపై దృష్టి సారించింది. ఇప్పటికే రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు పేరుతో రైతులకు పంటల మార్పిడిపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తున్నారు.

### తగ్గిపోతున్న పండ్ల తోటల విస్తీర్ణం...

కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పండ్ల తోటల విస్తీర్ణం తగ్గిపోతోంది. జిల్లాలోని రైతులు పెద్దగా పండ్ల తోటల పెంపకానికి మొగ్గు చూపడం లేదు. జిల్లాలో కేవలం కాగజ్‌నగర్ మండలంలోని జంబుగలో మాత్రమే కొంతమేర పండ్ల తోటలు సాగు చేస్తున్నారు. అక్కడక్కడా మామిడి తోటలు పెంచేందుకు రైతులు ఆసక్తి కనబరుస్తుండగా, మిగతా వాటి ఊసే లేదు. జిల్లాలో అతి తక్కువ ఎకరాల్లోనే పండ్ల తోటలు సాగు చేస్తున్నారని అధికారులు భావిస్తున్నారు. రైతులు పండ్ల, కూరగాయల తోటలు తొలగించి అధిక మొత్తంలో వాణిజ్య పంటల వైపు మొగ్గుచూపుతున్నారు.

పంట మార్పిడిపై అవగాహన

సాగులో పంటల మార్పిడిపై రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. ఒకే పంట వేయడం వల్ల భూసారం దెబ్బతినడంతో పాటు పంటలపై ప్రభావం చూపిస్తోంది. పంట మార్పిడి చేసేలా రైతులను ప్రోత్సహించేందుకు రైతు వారోత్సవాలు, రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాలు చేపడుతున్నాం. పంటల మార్పిడితోనే రైతులకు ప్రయోజనం కలుగుతుంది. ఒకేపంట సాగు చేయడం వల్ల ఉపయోగం ఉండదు. వరికి ప్రత్యామ్నాయంగా కూరగాయలు, ఉద్యాన పంటలు సాగుచేయాలి. రైతుల ప్రయోజనం కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు పంటల మార్పిడికి చర్యలు తీసుకుంటున్నాం.

# అసంపూర్తి రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలి

## సిపిఎం డిమాండ్

**నారాయణపేట ప్రతినిధి మే 17 ప్రజా జ్యోతి**

అప్పక్పల్లిబి కోటకొండ బికోయిలకొండ రెండు వరుసల రోడ్డు నిర్మాణ పనులు అర్ధాంతరంగా కాంట్రాక్టర్ గారు నిలిపివేయడంతో కోటకొండ మరియు అభంగాపూర్ పూర్, తిర్మలాపూర్, బండగొండ, బొమ్మనపాడు, అమ్మిరెడ్డిపల్లి తదితర గ్రామాల ప్రజలకు ప్రయాణం నరకప్రాయంగా మారిందని కోటకొండ గ్రామములో గురువారము రోజు కరపత్రం ప్రచారం సందర్భంగా బొమ్మను పాడు, అమ్మి రెడ్డి పల్లి గ్రామంలో మే 25వ తేదీన బైక్ యాత్రను విజయవంతం చేయాలని కరపత్రాలను విడుదల చేస్తున్న సందర్భంగా ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బొమ్మను పాడు బలరాం అధ్యక్షతన నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం జిల్లా నాయకులు గుండెగారి దస్తప్ప, కే కాశప్ప, నరహరి మాట్లాడుతూ రోడంత గుంతల మయంగా మారిందని గుంతలను తప్పించుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. అసంపూర్తి రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని కోరుతూ భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మే 25న కోటకొండ గ్రామంలోని భగత్ సింగ్ విగ్రహం నుంచి నారాయణపేట జిల్లా కలెక్టర్ వరకు బైక్ యాత్ర నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. గుంతల రోడ్ల వల్ల ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బతుకుదెరువు కోసం తెచ్చుకున్న ఆటోల వాళ్ల పరిస్థితి మాత్రం వచ్చిన ఆదాయం అంతా ఆటో



రిపైర్లకే ఖర్చుయితున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్ల విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఈ బైక్ యాత్ర జరుగుతున్నాయని బైక్ యాత్రలో ప్రజలందరూ భాగస్వామ్యమై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలో కరపత్రలు పంపిణీ చేసి కార్యక్రమానికి సంసిద్ధం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా నాయకులు చుక్క గోవిందు, గోటూరు మల్లేష్ బొమ్మనపాల్ సిపిఎం నాయకులు కనకప్ప, జనార్ధన్, ఆటో డ్రైవర్ యూనియన్ అనుమంతు, జన్ను, తిమ్మప్ప, అబ్దుల్, అమ్మిరెడ్డిపల్లి నాయకులు కనకప్ప, కొండప్ప, నరేష్ ప్రయాణం నరకప్రాయంగా మారిన రోడ్ల దుస్థితిపై సిపిఎం పార్టీ చేస్తున్న సమరానికి ప్రజలందరూ మద్దతుగా నిలవాలని కోరారు .ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు

# జడ్చర్ల మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా ఎం. గిరీష్ బాధ్యతల స్వీకరణ

**- భారీ వర్షాలతో దెబ్బతిన్న ప్రాంతాల పరిశీలన**

**-- పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచన**

**జడ్చర్ల, మే 17 (ప్రజా జ్యోతి ):**

జడ్చర్ల మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా ఎం. గిరీష్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఇటీవల భారీ వర్షాల కారణంగా కూలిన ఇండ్లను ఆయన పరిశీలించారు. ప్రమాదకర పరిస్థితుల్లో నివసిస్తున్న కుటుంబాలు వెంటనే పునరావాస కేంద్రంగా ఏర్పాటు చేసిన ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు వెళ్లాలని సూచించారు.

అదేవిధంగా జడ్చర్ల పట్టణంలోని శానిటేషన్, డ్రైనేజ్ వ్యవస్థలను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. పట్టణ పరిశుభ్రత, డ్రైనేజీ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. తదుపరి మున్సిపల్ మేనేజర్ లక్ష్మన్నతో పాటు కార్యాలయంలోని వివిధ విభాగాల




అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో కృషి చేయాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కమిషనర్ ఎం. గిరీష్ సూచించారు.

# మహబూబ్‌నగర్‌లో ఘనంగా “హ్యాపీ సండే” కార్యక్రమం

**– సాంస్కృతిక ప్రదర్శనలు, యోగా, కరాటే షోలతో అలరించిన చిన్నారులు**



**మహబూబ్‌నగర్, మే 17 (ప్రజా జ్యోతి బ్యూరో):**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఆదివారం ఉదయం 6 గంటల నుండి 9 గంటల వరకు మహబూబ్‌నగర్ స్టేడియం కమాన్ -- ప్రధాన రోడ్డు కూడలి వద్ద మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో “హ్యాపీ సండే” కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక నృత్యాలు, డాన్స్ ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. మ్యాజిక్ షో, యోగాసనాలు, మిమిక్రీ ప్రదర్శనలు సందర్శకులకు వినోదాన్ని పంచాయి. సీనియర్ సిటిజన్లు చేసిన డాన్స్ ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలవగా, విద్యార్థులు ప్రదర్శించిన కరాటే విన్యాసాలు అందరినీ మెప్పించాయి. అలాగే స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేసి వారు తయారు చేసిన పౌష్టికాహార పదార్థాలు, ఇతర వస్తువులను ప్రదర్శించారు. స్థానిక కార్పొరేటర్లు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




# ఈతాడుతూ వేసవి తాపానికి ఉపశమనం పొందుతున్న యువకులు



**నర్వమే 17 ప్రజా జ్యోతి**

ఎండల తీవ్రతకు ఉపశమనం పొందటానికి నారాయణపేట జిల్లాలో మండలములోని ఆయా గ్రామాలలో గ్రామాల్లో యువకులు చిన్నారులు, నీటి కులానులలో ఈత కొడుతూ ఉపశమనం పొందుతున్నారు మరికొందరు చిన్నారులు ఈత నేర్చుకుంటున్నారు, ఈ దృశ్యాలు మండలంలోని కుమార్ లింగంపల్లి గ్రామంలో ఓ రైతు పొలం వద్ద నిలువ చేసిన నీటి గుంత బావిలో ఈత కొడుతూ కాన రావడం జరిగింది, యువకులను అడుగగా ఎండ తీవ్రతలను ఉపశమంచికోవడం కోసమే ఈత కొలనులో ఈదుతూ సమయం గడుపుతున్నామని తెలిపారు అదే విధంగా ఈ తరాన్ని పిల్లలకు ఈత నేర్పుతున్నామని కొందరు యువకులు తెలిపారు

# మద్దూరు ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన బిజ్జా శ్రీనివాసులు



**మద్దూర్ మండల ప్రతినిధి ప్రజాజ్యోతి మే17:**

నారాయణపేట జిల్లా మద్దూరు పోలీస్ స్టేషన్‌లో నూతన ఎస్సైగా బిజ్జా శ్రీనివాసులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు మద్దూరు ఎస్సైగా విధులు నిర్వహించిన విజయ్ కుమార్ జిల్లా వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్సై బిజ్జా శ్రీనివాసులు మాట్లాడుతూ మద్దూరు మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ స్నేహపూర్వక పోలీసింగ్ అమలు చేస్తామని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి తెలియజేయాలని సూచించారు. గ్రామాల్లో అక్రమ కార్యకలాపాలు,మత్తు పదార్థాల వినియోగం, పేకాట, గంజాయి రవాణా, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని తెలిపారు. మహిళల భద్రత కోసం ప్రత్యేక చర్యలు చేపడతామని, యువత చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. మద్దూరు మండల ప్రజల సహకారంతో శాంతియుత వాతావరణం కొనసాగించేలా కృషి చేస్తామని ఎస్సై బిజ్జా శ్రీనివాసులు తెలిపారు.

# నీళ్ల కోసం గ్రామస్తుల పడిగాపులు

**ప్రజా జ్యోతి, మే 17:**

సాలార్ నగర్ గ్రామంలో గత కొద్ది రోజులుగా త్రాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో ప్రత్యామ్నాయంగా బోర్లు కూడా లేకపోవడంతో ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు.

గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ట్రాక్టర్ ద్వారా నీటి సరఫరా చేస్తున్నప్పటికీ అది సరిపోక ప్రజలు గంటల తరబడి నీళ్ల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు.

గ్రామంలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు వెంటనే కొత్త బోర్లు వేయించి, నేటి సమస్య తీర్చాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు



# ఉప్పును తగ్గిద్దాం - బీపీని నియంత్రిద్దాం!

### -రక్తపోటును తెలుసుకొని-గుండెను కాపాడుకోండి
### -డాక్టర్.సత్యనారాయణ

నాగర్ కర్నూల్ : మే 17(ప్రజా జ్యోతి)
రక్త పోటును తెలుసుకొని గుండెను కాపాడుకొనిఆరోగ్యంగా జీవించాలని డాక్టర్.సత్యనారాయణ అన్నారు.ప్రపంచ హైపర్ టెన్షన్ దినోత్సవం సందర్భంగా బిపి,షుగర్ ఉన్నవారికి సూచనలు చేశారు.ప్రస్తుతం జీవనశైలిలో ఒత్తిడి,మార్పులు,తగిన వ్యాయామం లేకపోవడం,అధిక ఉప్పు ఆహారం తీసుకోవడం వల్ల హైపర్‌టెన్షన్ (అధిక రక్తపోటు)సమస్య వేగంగా పెరుగుతోందని అధిక ఒత్తిడి,రక్తపోటు,గుండెపోటు,పక్షవాతం,కిడ్నీ వ్యాధులు తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుందన్నారు.హైపర్‌టెన్షన్‌కు చాలా సందర్భాల్లో ఎలాంటి లక్షణాలు కనిపించకపోవచ్చు అందుకే దీనిని"నిశ్శబ్ద హంతకుడు"అని పిలుస్తారనీ,30సంవత్సరాలు దాటిన వారు క్రమం తప్పకుండా రక్తపోటు పరీక్ష చేయించుకోవడం అవసరమని,హైపర్‌టెన్షన్ నివారణకు సూచనలు చేశారు.ప్రతి రోజూ కనీసం 30 నిమిషాలు వ్యాయామం,జంక్ ఫుడ్,ఉప్పు నూనె తగ్గించి,పండ్లు,ఆకుకూరలను ఎక్కువగా తీసుకోవాలని,ధూమ,మద్యపానాన్ని పూర్తిగా మాని మానసిక ఒత్తిడిని తగ్గించాలని షుగర్,బీపీ ఉన్నవారు వైద్యుల సూచనలతోనే మందులు క్రమం తప్పకుండా వాడాలని,తరచుగా బీపీ పరీక్ష చేయించుకోవాలని అన్నారు.ప్రపంచ హైపర్‌టెన్షన్ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరుతమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించి ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా బీపీ,షుగర్ పరీక్ష చేయించుకోవాలని హైపర్ టెన్షన్ ఉన్న వారు దగ్గరలోనీ ఆసుపత్రిలో వైద్యుల సమక్షంలోనే చికిత్సలు పొందాలన్నారు.



## 10వతరగతిలో 500 మార్కులు సాధించిన విద్యార్థులకు ఘన సన్మానం






నాగర్ కర్నూల్ : మే 17(ప్రజా జ్యోతి)
నాగర్ కర్నూల్ మండల పరిధిలోని తూడుకుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలోఆదివారం పదవ తరగతిలో 500 మార్కులు దాటిన విద్యార్థులకు ఘనంగా సన్మానించారు.500 నుంచి పైబడిన మార్కులు సాధించిన 16మంది విద్యార్థులు ఉండగా మొదటి ర్యాంకుగా నాజ్మిన్ 562 మార్కులతో నిలువగా,రెండవ ర్యాంకుగా దినేష్,సుఫియాన్ 557 మార్కులతో విజయఢంకా మ్రోగించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రఘు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కూడా పదవ తరగతిలో అత్యధికంగా మార్కులు సాధించి క్రింది తరగతతుల వారికి ఆదర్శంగా నిలిచిన వారిని అభినందించారు.7వ,రోజు బడిబాటలో బడికి రాని పిల్లల్ని మోటివేట్ చేసి పాఠశాలకు పంపాలన్నారు.అనంతరం పదో తరగతిలో 500 మార్కులు దాటిన 16 మందికి మెమొంటో పుష్పగుచ్చాలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.రఘు, సీనియర్ ఉపాధ్యాయులు,సత్యనారాయణ,అంజయ్య,ల్యాల వెంకట నర్సింహారెడ్డి,మురళీధర్ గౌడ్,సఫియా సుల్తానా,గోపాలా చారి,జి. రమేష్, మంజూర్ పాల్గొన్నారు.

## సురక్షితమైన బాల్యం పిల్లల హక్కు

### -లీగల్ సర్వీసెస్ అథారిటి సెక్రటరీ ఏ.శ్రీదేవి

నాగర్ కర్నూల్ : మే 17(ప్రజా జ్యోతి)
రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం తాడూర్ మండలం ఐతోల్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సురక్షిత్ బచ్పన్-సురక్షిత్ భవిష్య కార్యక్రమంనిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏ.శ్రీదేవి సెక్రెటరీ డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ నాగర్ కర్నూల్ హాజరై మాట్లాడుతూ సురక్షిత్ బచ్పన్-సురక్షిత్ భవిష్య"(సురక్షితమైన బాల్యం - సురక్షితమైన భవిష్యత్తు) అనేది పిల్లల హక్కుల పరిరక్షణ,భద్రత,వారికి ఉజ్వల భవిష్యత్తును అందించే దిశగా కేంద్ర ప్రభుత్వంతో పాటు వివిధ స్వచ్ఛంద సంస్థలు చేపట్టిన ముఖ్య కార్యక్రమం అని అన్నారు.పిల్లలను లైంగిక వేధింపులు, హింస,బాల కార్మిక వ్యవస్థ నుండి రక్షించడం.ప్రతి బిడ్డకు నాణ్యమైన విద్య,పోషకాహారాన్ని అందించడం బాల్య వివాహాలు బాలల అక్రమ రవాణా వంటి సామాజిక రుగ్మతలపై సమాజానికి అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం యొక్కముఖ్య ఉద్దేశ్యమని పిల్లల యొక్క హక్కులను కాపాడటానికి రాజ్యాంగపరమైన,చట్టపరమైన రక్షణలున్నాయి వీటి ద్వారా పిల్లలకు జీవించే హక్కు,అభివృద్ధి చెందే హక్కు,రక్షణ పొందే హక్కు,సమాజంలో భాగస్వామ్యం అయ్యే హక్కు లభిస్తుందని అన్నారు.మీ పరిసర ప్రాంతాల్లో పిల్లలకు ఏదైనా సమస్య ఎదురైనా,లేదా వారుఏదైనా ప్రమాదంలో ఉన్నారని భావిస్తే,అత్యవసర సహాయం కోసం టోల్-ఫ్రీ నంబర్ 1098 కు కాల్ చేయవచ్చుని ఇది పిల్లల అత్యవసర సహాయానికి 24/7 అందుబాటులో ఉండే జాతీయ టోల్-ఫ్రీ నంబరని అన్నారు.ఇట్టి కార్యక్రమంలో రవికాంత్ రావు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్,జి.పవన శేష సాయి గవర్నమెంట్ లాయర్,గ్రామ సర్పంచ్ సంధ్య,గ్రామ పంచాయతీ కార్యదర్శి సుఖజీవన్, గ్రామ పూజారి హరికృష్ణ,విద్యార్థులు పాల్గొన్నారు.




## ఎంపీ డీకే అరుణ, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచందర్ రావు ను సన్మానించిన ఓ బి సి రాష్ట్ర ఉపాధ్యక్షులు



**నారాయణపేట ప్రతినిధి మే 17 ప్రజా జ్యోతి**
ఓ బి సి మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షునిగా నియమించిన సందర్భంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ ఎన్ రాంచందర్ రావు గారిని,పాలమూరు ఎంపీ శ్రీమతి డీకే అరుణమ్మ ని, ఓ బి సి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఆనంద్ గౌడ్ ని కలిసి వారిని శాలువాతో సన్మానించి ధన్యవాదాలు తెలపడం జరిగింది. ఈ సందర్భంగా నాపై నమ్మకముంచి రాష్ట్ర మోర్చా కమిటీలో అవకాశం కల్పించిన ఎంపీ శ్రీమతి డీకే అరుణమ్మ గారికి,రాష్ట్ర నాయకులు శ్రీ నాగురావు నామాజి కి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీ రతంగ పాండు రెడ్డి కి,జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీ పగడాకుల శ్రీనివాస్ కి, జిల్లా అధ్యక్షుడు శ్రీ సత్య యాదవ్ కి,జిల్లా ఇంచార్జి బొక్క బాల్ రెడ్డి కి కృతజ్ఞతలు.ఇట్టి కార్యక్రమంలో మహబూబ్ అలీ, జి ఆర్ రెడ్డి,పగడాకుల సత్యనారాయణ పాల్గొన్నారు.





## తీరిన విద్యుత్ కష్టాలు

### -24,11 వార్డులలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

నాగర్ కర్నూల్ : మే 17(ప్రజా జ్యోతి)
నాగర్ కర్నూల్ పట్టణంలోని 24 మరియు 11వ, వార్డుల ప్రజల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది.గత కొంతకాలంగా విద్యుత్ లోడ్ పెరగడంతో తరచు ఏర్పడుతున్న కరెంటు కోతలతో ఈ వార్డు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు.సమస్యను గుర్తించిన స్థానిక కౌన్సిలర్లు చొరవ చూపి కొత్త ట్రాన్స్ ఫార్మర్‌లను ఏర్పాటు చేయించారు.24వ,వార్డ్ కౌన్సిలర్ నిజాముద్దీన్,11వ,వార్డ్ కౌన్సిలర్ ఖాదర్ ప్రత్యేక చొరవ తీసుకొని కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేయించారు.ఈ కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో 24 మరియు 11వ,వార్డుల పరిధిలోని గృహాలకు, వ్యాపార సంస్థలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందనుంది.సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే డా.కూచుకుళ్ల రాజేష్ రెడ్డి కి మరియు కౌన్సిలర్లకు వార్డు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నిజాముద్దీన్,ఖాదర్, విద్యుత్ అధికారులు,వార్డు ప్రజలు పాల్గొన్నారు.




## 18న "ఫిట్ అండ్ యాక్టివ్ తెలంగాణ" 2కే రన్

### -యువతలో ఆరోగ్య చైతన్యమే లక్ష్యం : ఎంపీడీఓ ఆదర్శ్ గౌడ్

చిన్నంబావి, మే 17 (ప్రజా జ్యోతి)తెలంగాణ ప్రభుత్వ "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక"లో భాగంగా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో చిన్నంబావి మండల కేంద్రంలో ఈ నెల 18న ఉదయం 6 గంటలకు భారీ 2కే రన్‌తో పాటు ఫిజికల్ లిటరసీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఆదర్శ్ గౌడ్ తెలిపారు."ఫిట్ డ యాక్టివ్ తెలంగాణ" మారథాన్ మరియు ఫిజికల్ లిటరసీ థీమ్‌తో నిర్వహించే ఈ కార్యక్రమం చిన్నంబావి ఎంపీడీఓ కార్యాలయం నుంచి పెద్ద దగడ క్రాస్‌రోడ్ వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. యువతలో ఆరోగ్య చైతన్యం పెంపొందించడం, వ్యాయామం మరియు ఫిట్‌నెస్‌పై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమన్నారు.రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఫిట్‌నెస్ కార్యక్రమాల్లో భాగంగా చేపడుతున్న ఈ 2కే రన్‌లో యువత, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు, సాధారణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీడీఓ ఆదర్శ్ గౌడ్ కోరారు.



# విద్యతోనే మహిళల సాధికారత సాధ్యం

## – ఎన్టీఆర్ మహిళా కళాశాలలో ఘనంగా విద్యా వారోత్సవాల ముగింపు కార్యక్రమం

మహబూబ్‌నగర్, మే 17 (ప్రజా జ్యోతి బ్యూరో): ప్రభుత్వ ఎన్టీఆర్ మహిళా డిగ్రీ అండ్ పీజీ అటానమస్ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యా వారోత్సవాల ముగింపు కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మహబూబ్‌నగర్ మేయర్ మమత మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం పేద ప్రజలకు అండగా నిలుస్తూ దేశానికి రోల్ మోడల్‌గా మారిందన్నారు. అలాగే ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ప్రతి రంగంలో మహబూబ్‌నగర్ నియోజకవర్గాన్ని ముందంజలో నిలిపేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి విజయాలు సాధించాలని పిలుపునిచ్చారు. కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపల్ అమీనా ముంతాజ్ జహాన్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం విద్యా వారోత్సవాలను నిర్వహించిందన్నారు. మహిళా సాధికారత, నాణ్యమైన విద్య, ఉపాధి అవకాశాల కల్పన కోసం డిగ్రీ కళాశాలల్లో నైపుణ్యాభివృద్ధి కోర్సులను ప్రవేశపెట్టడం ఈ ప్రణాళిక ప్రధాన ఉద్దేశమని వివరించారు.
అనంతరం రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ క్రీడాకారిణులను సన్మానించారు. అలాగే దేశ్ పాండే ఫౌండేషన్ ద్వారా వివిధ కంపెనీలలో ప్లేస్‌మెంట్లు సాధించిన విద్యార్థినులను అభినందించి



సత్కరించారు.సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థినులు మీనాక్షి, స్నేహ ప్రదర్శించిన భరతనాట్యం, కూచిపూడి నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. మహిళా సాధికారతపై ఎన్‌సీసీ విద్యార్థినులు ప్రదర్శించిన నాటికతో పాటు తెలుగు విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఏకపాత్రాభినయం ఆకట్టుకున్నాయి.
ఈ కార్యక్రమంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కన్వీనర్ డాక్టర్ ఎం. ప్రవీణ్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పద్మ అనురాధ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ జె. శ్రీదేవి, డాక్టర్ హరిబాబు, డాక్టర్ లక్ష్మీనరసింహారావు, మద్దిలేటి, డాక్టర్ మార్కండేయ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# తడిసిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

## – రైతులు ఆందోళన చెందొద్దని భరోసా ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు

మహమ్మదాబాద్, మే 17 ( ప్రజాజ్యోతి ): మండల కేంద్రంలో శనివారం కురిసిన అకాల వర్షానికి తడిసిన వరి ధాన్యాన్ని ఆదివారం కాంగ్రెస్ నాయకులు, అధికారులు పరిశీలించారు. స్థానిక ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన అధికారులు రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు.
పంట కోత అనంతరం విక్రయానికి తీసుకొచ్చిన ధాన్యం వర్షానికి తడవడంతో నాణ్యత తగ్గిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పెట్టుబడులు పెరిగి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తమకు ఈ నష్టం మరింత భారంగా మారిందని తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ఎంఆర్వో సుదర్శన్ రెడ్డి, ఏపీఎం నిర్మలతో కలిసి ధాన్యాన్ని పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వం తడిసిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తుందని రైతులకు భరోసా ఇచ్చారు. రైతులు ఎలాంటి దిగులు చెందవద్దని సూచించారు. అదేవిధంగా అక్కడికక్కడే మిల్లర్లతో మాట్లాడి తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని సూచించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు జే. రాంలాల్, మాజీ ఎంపీపీ శాంతి రంగయ్య, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం. రాఘవేందర్ రెడ్డి, డీసీసీ సభ్యుడు అనంతయ్య గుప్తా, వేణుగౌడ్, యూత్ ప్రెసిడెంట్ సాయి తేజ రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు హెచ్. ముకుందం, అంజ్య నాయక్, వార్డు సభ్యులు కేశవులు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



# పార్టీకి బలోపేతానికి కలిసికట్టుగా కృషి చేయాలి



**గద్వాల (ప్రజా జ్యోతి) మే 17:**
గద్వాల బాసు హనుమంతు నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం రోజు ఏర్పాటుచేసిన బూత్ కమిటీ ముఖ్య నాయకుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సభ్యత్వ నమోదు గద్వాల జిల్లా కేంద్రంలో బాసు హనుమంతు నాయుడు స్వగృహం నందు బిఆర్ఎస్ పార్టీ గద్వాల ఇంచార్జి బాసు హనుమంతు నాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమన్వయ బూత్ కమిటీ ముఖ్య నాయకుల సమావేశంలో మెట్టు శ్రీనివాస్ పాల్గొని,ముఖ్య నాయకులకు దిశా నిర్దేశం చేశారు త్వరలో బూత్ కమిటీ పై జిల్లా కేంద్రంలో పార్టీ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసుకుందాం అని తెలిపారు.వివిధ మండలలా ముఖ్య నాయకులు బాసు హనుమంతు నాయుడు సమక్షంలో మెట్టు శ్రీనివాస్ ని శాలువాతో ఘనంగా సత్కరించారు.
ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్.కేశవ్,వెంకటేశ్వర రెడ్డి, జి.రాఘవేంద్ర రెడ్డి,చక్రధర్ రావు,పటేల్ జనార్దన్ రెడ్డి,సూర్య గౌడ్,కురవ పల్లయ్య,వెంకటేష్ నాయుడు,చక్రిధర్ రెడ్డి,గంజిపేట రాజు,లక్ష్మారెడ్డి, వెంకటేష్,ఎస్.రాము నాయుడు,రాజు నాయుడు,తిమ్మప్ప గౌడ్,శ్రీరాములు, నాగరాజు,ఇద్దుం గోవిందు,మాలిక్, యు.తిరుమలేష్,పూడూరు రఘు నాయుడు,రాముడు,భీమేష్,నాగరాజు,రమేష్,బాబు,రాము,జగదీష్,మహేంద్ర, నరసింహులు, తిమ్మప్ప,రవి,వినయ్,భాస్కర్,సీనియర్ నాయకులు,కార్యకర్తలు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# నీట్ లీకేజ్.. ప్రభుత్వ వైఫల్యమే

డాక్టర్. ప్రేమ్ కుమార్



**అలంపూర్ డివిజన్ (ప్రజాజ్యోతి) మే 17:**
నీట్ పేపర్ లీక్ అవ్వడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే అని సామాజిక విప్లవ కారుడు డాక్టర్ ప్రేమ్ కుమార్ అన్నారు.ఈ సందర్భంగా ఎర్రవల్లి మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నీట్ పేపర్ లీకవ్వడం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుకుంటున్నారని విద్యార్థుల ప్రయాస వ్యర్థం అవుతుందని.ప్రతి సారి పేపర్ లీకవ్వడం ప్రభుత్వం చేతగానితనం గా అభివర్ణించారు.నీట్ ను పూర్తిగా రద్దు చేసి స్థానిక భాషలో ఎగ్జామ్ నిర్వహించాలని ఆయన కోరారు.నీట్ ఎగ్జామ్ రద్దు అవ్వడంతో ఒక విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం గురించి స్పందిస్తూ,విద్యార్థులు ధైర్యంగా ఉండాలని ప్రతి సమస్యను వివేకంతో ఎదుర్కోవాలని,విద్యార్థులు ఎలాంటి ప్రాణ హాని చేసుకోవద్దని సామాజిక విప్లవ కారుడు డాక్టర్ ప్రేమ్ కుమార్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

# గోవులకు మేత పంపించిన బీజేపీ కార్యకర్త తిరుపతయ్య



**గండీడ్, ప్రజాజ్యోతి, మే 17:**
హకీంపేట్‌లోని కేశవ ప్రియ గోశాల కు పశువుల మేతను బీజేపీ కార్యకర్త కే. తిరుపతయ్య తన సొంత ఖర్చులతో పంపించారు. జక్లపల్లి గ్రామానికి చెందిన ఆయన గోశాలలో ఉన్న గోవులకు ఆహారం కొరత లేకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ సహాయం అందించినట్లు తెలిపారు.
ఈ సందర్భంగా తిరుపతయ్య మాట్లాడుతూ, గోవులను కాపాడడం ప్రతి హిందువుకు ధర్మమని, సమాజంలో ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయం అందించాలని కోరారు. గోశాలలోని పశువుల సంక్షేమం కోసం భవిష్యత్తులో కూడా సహాయం కొనసాగిస్తానని తెలిపారు.
స్థానికులు తిరుపతయ్య సేవా భావాన్ని అభినందించారు.

# పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గండీడ్ మండలం, మే 17 (ప్రజా జ్యోతి):
గండీడ్ మండలంలోని వెన్నచేడ్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 1995–96 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొని పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.ఈ సందర్భంగా పాఠశాలలో చదువుకున్న రోజులను స్మరించుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. పూర్వ విద్యార్థులు మాధవరెడ్డి శ్రీను, అమరేందర్ రెడ్డి కే శ్రీనివాసులు ఆఫీస్ తదితరులు పాల్గొని ఉపాధ్యాయులను సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని పలువురు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు మరియు గ్రామానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



# ఎస్సీ వర్గీకరణ ఫలాలను సద్వినియోగం చేసుకోవాలి

### – ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము చెన్నకేశవులు మాదిగ పిలుపు



వనపర్తి, మే 17 (ప్రజాజ్యోతి): మాదిగ సమాజం ఎన్నో ఏళ్ల పోరాటాలతో సాధించుకున్న ఎస్సీ వర్గీకరణ ఫలాలను ప్రతి మాదిగ విద్యార్థి, యువత సద్వినియోగం చేసుకొని విద్య, ఉద్యోగ, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో ముందుకు రావాలని ఎమ్మార్పీఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు కొమ్ము చెన్నకేశవులు మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి చెన్నకేశవులు మాదిగ అధ్యక్షత వహించగా, అనుబంధ సంఘాల సమన్వయకర్త గంధం గట్టయ్య మాదిగ, నాయకుడు రాజానగరం రాజేష్ మాదిగ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు గ్రామస్థాయిలో సంస్థను మరింత బలోపేతం చేయాలని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ ద్వారా లభించే అవకాశాలపై మాదిగ సమాజంలో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దిశగా కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలని సూచించారు. అలాగే జూలై 7న జరిగే ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రతి మాదిగ పల్లెలో ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండాలు ఎగురవేయడంతో పాటు, గ్రామ కమిటీలు, జెండా దిమ్మలు లేని ప్రాంతాల్లో ఈ నెల 25 నుంచి 40 రోజులపాటు ప్రత్యేక కార్యక్రమంగా జెండా దిమ్మల నిర్మాణం చేపట్టాలని తీర్మానించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మాలపల్లి మన్యం మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి మీసాల నాగరాజు మాదిగ, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మొలకలపల్లి పరుషరాముడు మాదిగ, మండల అధ్యక్షులు మచ్చ తిరుపతి మాదిగ, దేవని రమేష్ మాదిగ, వెంకట్ రాములు మాదిగ, కృష్ణ మాదిగ, సోషల్ మీడియా నాయకుడు వర్మ మాదిగతో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైద్య శిబిరం విజయవంతం





నారాయణపేట ప్రతినిధి మే 17 ప్రజా జ్యోతి

లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణపేట మరియు ఏషియన్ ఇన్సిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ ౘ యురాలజీ వారిచే లయన్ కె. శివకుమార్ రెడ్డి ౘ లయన్ డా॥ పర్ణికారెడ్డి ఎమ్మెల్యే మార్గదర్శకత్వంలో, ప్రముఖ యురాలజిస్ట్ డా॥విశ్వజిత్ రెడ్డి ఎంబిబిఎస్ ., ఎమ్మెస్ (జనరల్ సర్జరీ) ఎం సి హెచ్ (యూరాలజీ) గారి పర్యవేక్షణలో, ఏషియన్ ఇన్సిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ ౘ యురాలజీ వారి డాక్టర్ల బృందంచే నేడు అనగా ఆదివారం రోజున ఎస్సార్ గార్డెన్ ఫంక్షన్ హాల్, మార్కెట్ రోడ్, నారాయణపేట యందు ఉచిత నెఫ్రాలజీ ౘ యురాలజీ (కిడ్నీ వ్యాధులు) పరీక్షా శిభిరం ఉ॥ 10 గం॥ల నుండి 3 గం॥ల వరకు నిర్వహించడం జరిగింది. ఈ శిబిరంలో పలు గ్రామాల నుండి 200 మందికి పైగా ఉచిత సేవలు ఉపయోగించుకున్నారు. వారిలో దాదాపు 80 మందికి పైగా పేషెంట్స్ కి తదుపరి చికిత్సలు అవసరం ఉండగా వారిని ఏఐఎన్యు ఆస్పత్రికి మరియు ఇతర ఆసుపత్రులకు వెళ్ళాలని సూచించారు. అక్కడ కూడా అతి తక్కువ ఖర్చుతో చికిత్స అందిస్తామని డా విశ్వజిత్ రెడ్డి గారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి, మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్ లయన్ హరినారాయణ భట్టాడ్, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ సరిత భట్టాడ్, ఏఐఎన్యు డా విజయ్, కౌన్సిలర్ రాజేష్ ఘూట్, నాయకులు కోట్ల రవీంద్ర రెడ్డి, టౌన్ అధ్యక్షుడు సలీం, వెంకటేష్ గౌడ్ మరియు లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## చింతకుంటలో భారీ కోడె నాగుపాము కలకలం..

గ్రామస్తుల్లో ఆందోళన
- గుడ్లు మింగి కదలలేని స్థితిలో నాగుపాము
- స్నేక్ సొసైటీ చాకచక్యంతో పట్టుబడ్డ నాగుపాము
- సురక్షితంగా అడవిలో విడిచిన స్నేక్ సొసైటీ చీర్ల కృష్ణ సాగర్



**వనపర్తి ప్రతినిధి, మే 17 (ప్రజాజ్యోతి):**

వనపర్తి జిల్లా పానగల్ మండలం చింతకుంట గ్రామంలో ఆదివారం భారీ కోడె నాగుపాము కలకలం రేపింది. గ్రామానికి చెందిన యాదగిరి స్వామి ఇంటి వద్ద ఉన్న కోళ్ల గూటిలోకి ప్రవేశించిన నాగుపాము ఒక కోడిని చంపి, పొదిగేందుకు ఉంచిన 9 గుడ్లను మింగింది. ఉదయం కోళ్ల గూటి వద్ద అలజడి శబ్దాలు రావడంతో ఇంటి యజమాని వెళ్లి చూడగా భారీ నాగుపాము కనిపించింది. గుడ్లు మింగడంతో కదలలేని స్థితిలో అక్కడే ఉండిపోయిన పామును గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే వనపర్తి జిల్లా స్నేక్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు చీర్ల కృష్ణసాగర్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న కృష్ణసాగర్ హుటాహుటిన గ్రామానికి చేరుకుని నాగుపామును సురక్షితంగా పట్టుకుని సమీప అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. జనావాస ప్రాంతంలో భారీ నాగుపాము కనిపించడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. కోడిని చంపి గుడ్లు మింగిన నాగుపామును చూసేందుకు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోయినా కోడి మృతి చెందింది. సమయానికి స్పందించి పామును సురక్షితంగా పట్టుకున్న చీర్ల కృష్ణసాగర్‌ను గ్రామస్తులు అభినందించారు.



### యంగ్ ఇండియా పాఠశాల, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్ హరిప్రియ



**మహబూబ్‌నగర్, మే 17 ( ప్రజా జ్యోతి బ్యూరో )**

రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ ఆదివారం చిన్నచింతకుంట మండలంలోని ధమగ్నాపూర్ గ్రామంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించి పాఠశాల నిర్వహణ, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న వసతులు, పరిశుభ్రత, విద్యా ప్రమాణాలపై అధికారులతో చర్చించారు.

అనంతరం చిన్నచింతకుంట మండలంలోని లాల్‌కోట చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్‌తో కలిసి సందర్శించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్, మండల సర్వేయర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## గోదాం, మిల్లులలో ధాన్యం అన్‌లోడింగ్ వేగవంతం చేయాలి

### – అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ ఆదేశం



**వనపర్తి ప్రతినిధి, మే 17 (ప్రజాజ్యోతి):**

జిల్లాలో గోదాంలు, రైస్ మిల్లుల వద్ద వరి ధాన్యం అన్‌లోడింగ్ పనులను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఆదివారం ఖిల్లాఘణపురం మండలంలోని మానాజీపేటలో ఉన్న కిల్లా అగ్రో గోదాం, శ్రీరామ ఇండస్ట్రీస్, లక్ష్మీనరసింహ మిల్స్‌లను ఆయన సందర్శించి వరి ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. లారీలను ఎక్కువసేపు వేచి ఉండే పరిస్థితి రాకుండా వెంటనే అన్‌లోడింగ్ పూర్తి చేయాలని సూచించారు. రైతులు ఇబ్బందులు పడకుండా సమయానికి ధాన్యం అన్‌లోడింగ్ పూర్తి చేసి, రవాణా వ్యవస్థను సమన్వయంతో నిర్వహించాలని తెలిపారు. అదేవిధంగా కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను కూడా వేగంగా పూర్తి చేసి, తూకం ప్రక్రియలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ సుగుణ, ఇతర అధికారులు అదనపు కలెక్టర్ వెంట ఉన్నారు.

### నేడు “ఫిట్ అండ్ యాక్టివ్ 2 కే రన్

#### –జిల్లా క్రీడల అధికారి సీతారాం నాయక్



నాగర్ కర్నూల్ : మే 17(ప్రజా జ్యోతి)

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా “ఆరోగ్య తెలంగాణ” కార్యక్రమాన్ని పురస్కరించుకుని నేడు (18వ తేదీ సోమవారం)

ఉదయం 7 గంటలకు నాగర్ కర్నూల్ పట్టణంలో “ఫిట్ అండ్ యాక్టివ్ 2కే రన్” కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు క్రీడలు,యువజన సర్వీసుల శాఖ జిల్లా అధికారి సీతారాం నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం నుండి ప్రారంభమై ట్యాంక్ బండ్ వరకు కొనసాగుతుందని ఆయన ఆయన పేర్కొన్నారు.

# చిన్నంబావి మండల ప్రజలకు అవగాహన కల్పించిన ఎస్సై రామన్ గౌడ్

**-పోక్సో చట్టంపై అవగాహన కల్పించిన ఎస్సై రామన్ గౌడ్**

చిన్నంబావి,మే 17 (ప్రజాజ్యోతి)



చిన్నంబావి న్యూస్‌టుడే:సమాజంలో పెరుగుతున్న సైబర్ నేరాలు, మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చిన్నంబావి మండల స్థానిక ఎస్సై రామన్ గౌడ్ సూచించారు.ఆదివారం పోలీస్ స్టేషన్ ఆవరణంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వివిధ గ్రామాల గ్రామస్తులకు పోక్సో చట్టం, సైబర్ క్రైమ్, బాల్యవివాహాలు, రోడ్డు భద్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్సై రామన్ గౌడు మాట్లాడుతూ.. మైనర్ బాలికలను లైంగికంగా,మానసికంగా వేధించిన వారిపై పోక్సో చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చిన్నారులపై వేధింపులు, దాడుల ఘటనలు తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.సైబర్ నేరగాళ్లు పంపించే ఫోన్‌కాల్స్,లింకులు, మెసేజ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు, ఆధార్ సమాచారం ఎవరితోనూ పంచుకోవద్దన్నారు. మోసాలకు గురైతే వెంటనే డయల్--100కు సమాచారం అందించాలని సూచించారు.బాల్యవివాహాలు చట్ట విరుద్ధమని,అలాంటి ఘటనలు గుర్తిస్తే అధికారులకు తెలియజేయాలని కోరారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు.రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా వినియోగించాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల నేరాల నియంత్రణకు ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, వివిధ గ్రామాల వారు గ్రామస్తులు, యువకులు,మహిళలు పాల్గొన్నారు.

# ఎప్సెట్ - 2026లో రిషి కళాశాల ఘన విజయం

**- పాలమూరు విద్యారంగంలో మరోసారి తన ఆధిపత్యాన్ని నిరూపించిన రిషి**



మహబూబ్‌నగర్, మే 17 ( ప్రజా జ్యోతి బ్యూరో ) పాలమూరు విద్యారంగంలో తనదైన ప్రత్యేకతను చాటుకుంటూ ముందుకు సాగుతున్న రిషి జూనియర్ కళాశాల, ఎప్సెట్ - 2026 ఫలితాలలో మరోసారి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఘన విజయాన్ని నమోదు చేసింది. రాష్ట్రంలోని కార్పొరేట్ కళాశాలలకు దీటుగా నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యార్థులను ఉన్నత ర్యాంకుల దిశగా నడిపిస్తున్న రిషి విద్యాసంస్థలు ఈ ఏడాది కూడా అద్భుత ఫలితాలతో పాలమూరు జిల్లాకు గర్వకారణంగా నిలిచాయి. అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగంలో 1000 లోపు 11 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించి కళాశాలకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చారు. సమీరా బేగం రాష్ట్ర స్థాయిలో 180వ ర్యాంకు సాధించగా, అమూల్య 221, నందిని రెడ్డి 348, మనస్విత 404, నుజత్ 446, హప్స మోహిన్ 457, మాలిహ తహనీయత్ 684, భావన 723, అదిబా మైహిన్ 725, ప్రసన్న లక్ష్మి 895, సాయి శ్రీ 1000వ ర్యాంకులు సాధించి ప్రతిభ చాటారు. రూపశ్రీ 1006వ ర్యాంకు సాధించారు.

ఇంజనీరింగ్ విభాగంలో కూడా రిషి విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. కిరణ్ 1109, నరహరి 1213, సయ్యద్ మిస్బవుద్దీన్ 1801, కిషోర్ కుమార్ 1951, సంతోష్ 2456, జ్యోతిర్నాథ్ 2513 రాష్ట్ర ర్యాంకులు సాధించి కళాశాల ప్రతిష్టను మరింత పెంచారు. అదనంగా అనేక మంది విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు కళాశాల డైరెక్టర్ వెంకటయ్య, చైర్‌పర్సన్ చంద్రకళ తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ వెంకటయ్య, చైర్‌పర్సన్ చంద్రకళ ప్రత్యేకంగా అభినందించి వారి భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణ, నాణ్యమైన బోధన, అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం, విద్యార్థుల కృషి ఫలితంగానే ఈ విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ భూపాల్ రెడ్డి, అకాడమిక్ డీన్ కళ్యాణ్ బాబు, ప్రిన్సిపల్స్ రాఘవేంద్రరావు, వెంకటరత్నం, ప్రసన్న, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పెద్దమారూర్ గ్రామంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

చిన్నంబావి, మే 17 (ప్రజాజ్యోతి)

చిన్నంబావి మండల కేంద్రంలోని పెద్దమారూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002-2003 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత ఒకే వేదికపై కలుసుకున్న సహపాఠులు పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ భావోద్వేగాలకు లోనయ్యారు.పాఠశాల ప్రాంగణం పూర్వ విద్యార్థుల సందడితో కళకళలాడింది. చిన్ననాటి స్నేహితులు, సహచరులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ అప్పటి మధుర క్షణాలను గుర్తు చేసుకున్నారు. చదువుకున్న తరగతి గదులు, ఆటస్థలం, గురువుల బోధనలు గుర్తుచేసుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా అప్పటి గురువులు విష్ణు, అనంత రెడ్డి, చెన్నయ్య, వెంకట్ గౌడ్, బాలస్వామి, మోహన్, ఈశ్వర్ రెడ్డి లను పూర్వ విద్యార్థులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి పాదాభివందనం చేశారు. తమ జీవితాలకు దిశానిర్దేశం చేసిన గురువులను మరోసారి కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని పలువురు విద్యార్థులు పేర్కొన్నారు.సంపత్ కుమార్, శాలు, ప్రవీణ్, రాజేంద్ర ప్రసాద్, పరుశరామ్, మాధవి,హుసేనమ్మ, విజయలక్ష్మితో పాటు బ్యాచ్‌కు చెందిన పలువురు విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తమ ప్రస్తుత జీవితం, ఉద్యోగాలు, కుటుంబ పరిస్థితులు, భవిష్యత్తు లక్ష్యాలను గురువులతో పంచుకున్నారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, క్రమశిక్షణతో ముందుకు సాగుతూ పాఠశాల కీర్తిని మరింత పెంచాలని ఆకాంక్షించారు. గురువుల ఆశీస్సులు తమకు ఎల్లప్పుడూ మార్గదర్శకమని పూర్వ విద్యార్థులు తెలిపారు.అనంతరం గురువులు, విద్యార్థులు కలిసి సమూహ ఛాయాచిత్రాలు దిగుతూ ఆ మధుర క్షణాలను జ్ఞాపకాలుగా నిలుపుకున్నారు. పాత స్నేహాలను మరింత బలపరిచిన ఈ ఆత్మీయ సమ్మేళనం ఆనందభాష్పాల మధ్య ముగిసింది. గురువులు పూర్వ విద్యార్థులు తదితరులు ఉన్నారు.



# దేవాదాయ శాఖకు ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలి

- ప్రాచీన ఆలయాల అభివృద్ధికి కొత్త ఈఓ పోస్టులు కీలకం
- చిన్నారెడ్డిని ఘనంగా సన్మానించిన నూతన కార్యనిర్వహణాధికారులు



**వనపర్తి, మే 17 (ప్రజాజ్యోతి):**

తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖలో నూతనంగా 190 కార్యనిర్వహణాధికారి (ఈఓ) పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన సందర్భంగా, ఆ ప్రక్రియలో కీలక పాత్ర పోషించిన రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డిని నూతన ఈఓలు ఆదివారం ఆయన నివాసంలో ఘనంగా సన్మానించారు. పూల బొకే అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలోని ఎన్నో ప్రాచీన ఆలయాలు తగిన నిర్వహణాధికారుల కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. నూతనంగా 190 పోస్టుల మంజూరుతో ఆలయాల పరిపాలన మరింత సమర్థవంతంగా సాగడంతో పాటు, దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న వేల కోట్ల రూపాయల ఆస్తులను పరిరక్షించే అవకాశం కలుగుతుందని తెలిపారు. నూతనంగా నియమితులైన కార్యనిర్వహణాధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించి దేవాదాయ శాఖకు, రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘం రాష్ట్ర నాయకులు జనుంపల్లి జయపాల్ రెడ్డి, ప్రసాద్, శ్రీనివాస్ గౌడ్, యుగంధర్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, వనపర్తి పట్టణ ప్రధాన కార్యదర్శి బాబా, వనపర్తి మండల ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు ఎత్తం చరణ్ రాజ్, ఎంట్ల రవి, సోషల్ మీడియా రాజు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా యువజన - క్రీడాశాఖ ఆధ్వర్యంలో "యూత్ వీక్ సెలబ్రేషన్స్--2026" కార్యక్రమాలు

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్**

**గద్వాల (ప్రతినిధి)**

"ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" - 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా యువజన మరియు క్రీడాశాఖ ఆధ్వర్యంలో "యూత్ వీక్ సెలబ్రేషన్స్--2026" కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్ ఒక ప్రకటనలో తెలిపారు. యువతలో క్రీడాస్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలపై అవగాహన మరియు సామాజిక బాధ్యత పెంపొందించేందుకు ఈ నెల 18వ తేదీ నుండి 23వ తేదీ వరకు జిల్లా మరియు మండల స్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. మే 18: " ఫిట్ అండ్ యాక్టివ్ తెలంగాణ" కార్యక్రమంలో భాగంగా 5కే రన్, మారథాన్, 2కిమీ వాక్ థాన్, యోగా, జుంబా మరియు ఫిట్‌నెస్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడతాయి.మే 19: "కెరీర్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ డే" సందర్భంగా కెరీర్ గైడెన్స్, స్కిల్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్స్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అవగాహన మరియు పోటీ పరీక్షలపై అవగాహన కార్యక్రమాలు. మే 20: "యూత్ లీడర్షిప్ సమ్మిట్"లో భాగంగా లీడర్‌షిప్ సెషన్స్, మోటివేషనల్ టాక్స్, యూత్ పార్లమెంట్ మరియు వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు. మే 21: "ప్లే అండ్ పార్టిసిపేట్ స్పోర్ట్స్ డే" సందర్భంగా కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్ మరియు ఇతర గ్రామీణ క్రీడా పోటీలు నిర్వహించబడతాయి. మే 22: ". సర్వ్ అండ్ సపోర్ట్ యూత్ ఫర్ క్లీన్ తెలంగాణ" కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛత కార్యక్రమాలు, మొక్కలు నాటడం, శుభ్రత డ్రైవ్స్ మరియు అవగాహన ర్యాలీలు నిర్వహించబడతాయి. మే 23: "కనెక్టింగ్ టాలెంట్ విత్ ఆపర్చునిటీస్" కార్యక్రమంలో భాగంగా మెగా జాబ్ మేళా, ఉద్యోగ నమోదు, ఇంటర్వ్యూలు, కెరీర్ కౌన్సిలింగ్ మరియు ప్లేస్‌మెంట్ సపోర్ట్ కార్యక్రమాలు నిర్వహించబడతాయి. జిల్లాలోని యువత, విద్యార్థులు, క్రీడాకారులు మరియు ప్రజలు ఈ కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోరారు.